క్లుప్తంగా

తాగు, సాగునీరు అందించాలి



మాట్లాడుతున్న హంద్రీనీవా ఏఈ హరిప్రసాద్

గుంతకల్లు రూరల్: మండలంలోని ప్రతి గ్రామానికీ తాగు, సాగునీటిని అందించాలని సీపీఐ నాయకులు కోరారు. మంగళవారం వారు హంద్రీనివా ఏఈ హరిప్రసాద్‌తో కలసి మండలంలోని మొలకలపెంట, శంకరబండ, కొంగనపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి మాట్లాడుతూ గుండాల తండా, మొలకలపెంట తండా, మొలకలపెంట, కొంగనపల్లి, శంకరబండ గ్రామాల మీదుగా వైటీ చెరువుకు హంద్రీనీవా నీటిని తీసుకెళ్లగలిగితే ఆయా గ్రామాల్లోని ప్రతి ఎకరాకూ తాగునీరు, ప్రతి గ్రామానికి తాగునీరు అందే అవకాశం ఉందన్నారు. ఈ పనుల వల్ల దాదాపు 8 గ్రామాల్లో వలసలను, రైతు ఆత్మహత్యలను నివారించవచ్చన్నారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని వారు హంద్రీనివా ఏఈని కోరారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

గుంతకల్లుటౌన్: మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాల్‌లో నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కౌన్సిల్, కో ఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచారని ప్రధానోపాధ్యాయురాలు వసుంధర మంగళవారం తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో ఈ నెల 17,18,19 తేదీల్లో అంతర్ జిల్లాల జూనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారన్నారు. పోటీల్లో జిల్లా జట్టు తృతీయ స్థానం సాధించిందన్నారు. బీకేఎస్ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 10వ తరగతి చదువుతున్న చరణ్ తేజ్, నవనీత్, 9వ తరగతి చదువుతున్న అజయ్, గణేష్, అరవింద్‌రెడ్డి, జట్టు విజయానికి ఎంతో తోడ్పాటు అందించారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో పీడీలు గోపాల్‌రెడ్డి, లలితమ్మ, నీలకంఠారెడ్డి, ఆనంద్, నాగరాజు గౌడ్, శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామదేవత ఊరేగింపు



అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: మండలంలోని కసాపురం గ్రామంలో మంగళవారం గ్రామదేవత దేవమ్మ అమ్మవారి ఊరేగింపు ఉత్సవాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఏటా శ్రావణమాసం నాలుగో మంగళవారం గ్రామదేవత ఊరేగింపు నిర్వహించడం ఆనవాయితీ. ఈసందర్భంగా మంగళవారం సాయంత్రం గ్రామస్తులు గ్రామ శివారులోని అమ్మవారి పాదాల వద్దకు ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళశంలో అమ్మవారిని ఆవాహనం చేసుకుని ఊరేగింపుగా తిరిగి దేవమ్మ అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. గ్రామస్తులు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటూ అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఉల్లికల్లుకు ముంపు పరిహారం అందించేందుకు కృషి



ఉల్లికల్లులో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల: చాగల్లు రిజర్వాయర్ ముంపు గ్రామమైన ఉల్లికల్లుకు పరిహారం అందించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. మంగళవారం మండలంలోని ఉల్లికల్లు, ఉల్లికంటిపల్లి గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఉల్లికల్లులో రచ్చకట్ట వద్ద గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ప్రచారానికి బుక్కరాయసముద్రానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి సమస్య తీసుకెళ్లామని గుర్తు చేశారు. అలాగే నారా లోకేష్ పాదయాత్రలో ముంపు పరిహారం అందిస్తామని చెప్పారన్నారు. ఆ హామీ మేరకు పరిహారం అందించడానికి కృషి చేస్తామన్నారు. ముంపు గ్రామమైనందున ప్రభుత్వం అందించే అభివృద్ధి పనులు జరగడం లేదని, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధి పనులు అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మయ్య, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



రక్షణ కల్పించాలి

ఆస్పత్రుల్లో భద్రత లేకపోవడం వల్ల వైద్య సిబ్బందికి అభద్రతభావం పెరుగుతోంది. అంకితభావంతో విధులు నిర్వర్తించే వైద్యులకు ప్రశాంతత, స్వేచ్ఛ కరువైంది. ఇలాంటి భయానక వాతావరణం నుంచి వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాల్సిన అవసరమైంతైనా ఉంది. ప్రభుత్వాలు స్పందించి వైద్యసిబ్బందిపై హత్యలు, దాడులు పునరావృత్తం కాకుండా ఫుల్‌స్టాప్ పెట్టాలి.

– జి.శివకార్తీక్‌రెడ్డి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి, పామిడి



కఠినంగా శిక్షించాలి

కలకత్తాలోని వైద్యురాలి హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలి. ఆడవారిని తల్లిగా, అక్కగా, చెల్లిగా భావిస్తే ఇలాంటి అమానవీయ సంఘటనలు ఉండవు. మహిళలను హత్యాచారం చేసిన వారిపై తక్షణం శిక్ష అమలు చేసేలా కఠిన చర్యలు తీసుకోవాలి. మహిళల సంరక్షణ కోసం ప్రత్యేక చట్టాలు రూపొందించాలి. అలాగే ఆస్పత్రుల్లో వైద్య సిబ్బందికి భద్రత కల్పించాలి.

–బత్తల మౌనిక. గైనిక్ డాక్టర్, సీహెచ్‌సీ, పామిడి



వైభవంగా శ్రీకృష్ణుడి శోభాయాత్ర

గుత్తి: గుత్తిలో మంగళవారం గౌతమిపురి నగర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులు, ప్రజలు శ్రీకృష్ణుని శోభాయాత్ర (ఊరేగింపు) ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ సర్కిల్ వద్ద నుంచి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో శ్రీకృష్ణుని విగ్రహాన్ని కొలువుదీర్చి ఊరేగించారు. దారి పొడవునా భక్తులు కోలాటాలు, డాన్స్‌లు వేస్తూ ఆనందంతో కేరింతలు కొట్టారు. కార్యక్రమంలో గౌతమిపురి నగర ఉత్సవ కమిటీ అధ్యక్షులు తిమ్మారెడ్డి, ఉపాధ్యక్షులు నారాయణరెడ్డి, జేకె రాము, రాము, ప్రధాన కార్యదర్శులు రంగ ప్రసాద్ రాయల్, మారాకుల రమణ, వీరోజి, శిరీష, భక్తులు పాల్గొన్నారు.

గుత్తి రూరల్: మండలంలోని వన్నేదొడ్డి, కొత్తపేట గ్రామాల్లో మంగళవారం కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. కొత్తపేటలో జరిగిన కృష్ణాష్టమి వేడుకలలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పాల్గొన్నారు. వన్నేదొడ్డిలో కృష్ణుడి చిత్రపటాన్ని ఎద్దులబండిపై ఊరేగించారు. ఈ సందర్భంగా చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలో అలరించారు. ఊరేగింపులో కోలాటాలు, చెక్క భజనలు చేశారు.

పెద్దపప్పూరు: మండల కేంద్రంలోని కృష్ణ స్వామి దేవాలయంలో కృష్ణాష్టమి సందర్భంగా మంగళవారం స్వామి ఉత్సవమూర్తిని ఊరేగించారు. రాత్రి పౌరాణికి నాటక ప్రదర్శన నిర్వహించారు.



గుత్తిలో శ్రీకృష్ణుని శోభాయాత్ర చేస్తున్న భక్తులు



శింగనమలలో ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ



కసాపురంలో స్వామి మహాభిషేకాన్ని వీక్షిస్తున్న నైరుతిరెడ్డి, మంజునాథ్‌రెడ్డి



పెద్దవడుగూరులో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం



యాడికి మండలం కొట్టాలపల్లెలో రాధాకృష్ణుల ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నెట్టికంటుడికి మహాభిషేకం

గుంతకల్లు రూరల్: కృష్ణాష్టమిని పురస్కరించుకుని కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్వామికి మహాభిషేకం నిర్వహించారు. కృష్ణాష్టమి పర్వదినాన మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నెట్టికంటి ఆంజనేయస్వామి వారికి మహాభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం ఆలయానికి చేరుకున్న వైవీఆర్ కూతురు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, ఆమె భర్త వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు మంజునాథ్‌రెడ్డికి ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామికి వారు సమర్పించిన అభిషేక ద్రవ్యాలతో అర్చకులు మహాభిషేకం నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలను వారికి అందజేశారు. కార్యక్రమంలో కసాపురం మాజీ సర్పంచ్ తిక్కస్వామి, వైఎస్సార్‌సీపీ మండల యువజన కన్వీనర్ బెస్త మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో మంగళవారం శ్రీకృష్ణ జన్మదిన వేడుకలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గంగమ్మ ఆలయ ఆవరణంలో స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు చేశారు. సాయంత్రం స్వామి విగ్రహం, చిత్రపటాన్ని ఎద్దుల బండిపై ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

యాడికి: మండలంలోని కొట్టాలపల్లెలో రాధాకృష్ణ దేవస్థానంలో మంగళవారం కృష్ణాష్టమి వేడుకలను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం రాధాకృష్ణుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి గ్రామోత్సవం చేశారు. రాత్రి ఆలయం ఆవరణలో భజన కార్యక్రమం నిర్వహించారు. వేములపాడు సర్పంచు ఓంకారమ్మ, ఆలయ కమిటీ ధర్మకర్త శ్రీనివాస యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాద్‌రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శింగనమల: మండల కేంద్రంలో మంగళవారం కృష్ణాష్టమి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. చిన్నారుల వేషధారణలతో గొల్ల వీధి నుంచి రామాలయం వరకూ ఊరేగింపు చేశారు. రామాలయం వద్ద ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహానికి అర్చకులుప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పూజలు నిర్వహించారు. రాత్రి గ్రామంలో శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహాన్ని వైభవంగా ఊరేగించారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

తాడిపత్రి: మండలంలోని తేరన్నపల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రూరల్ ఏఈ రామాంజనేయులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 220 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తాడిపత్రి పట్టణంతో పాటు రూరల్ పరిధిలో కరెంట్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

డ్వాక్రా మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లుటౌన్: స్వయం సహాయక సంఘాల సభ్యులు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను జీవనోపాధుల కోసం వినియోగించుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని సూచించారు. మంగళవారం పాత గుత్తిరోడ్‌లోని పట్టణ సమాఖ్య కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి పనుల ద్వారా ఆర్థిక ప్రగతి సాధించడంతో పాటు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించినట్లయితే భవిష్యత్తులో అధిక రుణం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆంజనేయులు, మెప్మా టీపీఆర్ఓ మోహన్, సీఎంఎం భవాని, టీడీపీ నాయకుడు నారాయణస్వామి, సీఓలు, పట్టణ సమాఖ్య లీడర్లు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటును స్వాగతిస్తాం



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి

పెద్దవడుగూరు: మండలంలోని కొండుపల్లి, క్రిష్టిపాడు గ్రామాల్లో మైనింగ్ గనుల ఏర్పాటును స్వాగతిస్తామని క్రిష్టిపాడు గ్రామస్తులు అన్నారు. మంగళవారం మండలంలోని కొండుపల్లిలో శ్రీత్రిశక్తి మైన్స్ అండ్ మినరల్స్ మైనింగ్ గని నిర్వహణ పై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ మైనింగ్ గని నిర్వహణ యజమానులు చేపట్టాల్సిన పనుల గురించి వివరించారు. అనంతరం క్రిష్టిపాడు యువకులు మాట్లాడుతూ గనుల యజమానులు స్థానిక ప్రభుత్వాపత్రిలో మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామంలో రోడ్లు వేయించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సీఎస్ఆర్ బడ్జెట్‌లో నిధులు కేటాయించి మౌలిక వసతులను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పర్యావరణం కాలుష్య నియంత్రణ అధికారి కిషోర్ రెడ్డి, డీటీ వెంకటేశ్వరమ్మ , ప్రజలు పాల్గొన్నారు.

రేపు మూడో విడత ఐటీఐ కౌన్సెలింగ్

గుంతకల్లుటౌన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రవేశానికి మూడో విడత దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 29న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ విద్యాసాగర్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ పూర్తి చేయించుకున్న విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఇతర ధ్రువీకరణ పత్రాలతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

యాడికి: మండలంలోని వేములపాడు వద్ద మంగళవారం ఉదయం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సీఐ ఈరన్న తెలిపారు. మండల కేంద్రానికి చెందిన రంగనాయకులు పెద్దపప్పూరు మండలం జూటూరు వద్ద పెన్నానది నుంచి ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా నిందితుడిని అరెస్టు చేశామన్నారు.

తాగునీటి పథకం కార్మికుల వినూత్న నిరసన

బుక్కరాయసముద్రం/గార్లదిన్నె: తమ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని సత్యసాయి వాటర్ ప్రాజెక్ట్‌లో పని చేస్తున్న కార్మికులు విమర్శించారు. డిమాండ్ల సాధనలో భాగంగా బీకేఎస్‌లోని సత్యసాయి వాటర్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమాలు మంగళవారం ఆరో రోజుకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో వేపాకు తింటూ వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. కార్మికులు మాట్లాడుతూ సత్యసాయి వాటర్ ప్రాజెక్ట్‌లో పని చేస్తున్న కార్మికులకు ఆరు నెలల జీతాల బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘం నాయకులు రాఘవేంద్రాచారి, దేవదాస్, కిష్టప్ప, లక్ష్మన్న, పెద్దన్న, నల్లప్ప, నారాయణ, విశ్వరూప, ప్రకాష్ కుమార్, విశ్వనాథ్, నరహరి, జగదీష్ ప్రకాష్ పాల్గొన్నారు. అలాగే గార్లదిన్నె మండలం కల్లూరులో చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో కార్మికులు నాగభూషణ, మల్లరాయుడు, జనార్దనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వేపాకు తింటూ నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ప్రజాకవి ఏలూరు ఎంగన్నకు సన్మానం

పామిడి: పట్టణంలోని స్వరరాగ కళాసమితి ఉచిత శిక్షణాలయంలో మంగళవారం ప్రజాకవి ఏలూరు ఎంగన్నను ఘనంగా సన్మానించారు. ఆ కళాసమితి 16వ వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయనను ఆ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం. దేవరాజ్ ఆధ్వర్యంలో పుష్పాభిషేకంతో పాటు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన సంగీతం, సాహిత్యం, పౌరాణిక నాటకాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఆ సమితి సభ్యులు, పుంజా కృష్ణారావు యాదవ్, బెస్త సుబ్రమణ్యం, నారాయణరెడ్డి, హనుమంతరెడ్డి, నాగార్జున, గోపాల్, చితంబరయ్య తదితరులు పాల్గొన్నారు.



ఏలూరు ఎంగన్నను సన్మానిస్తున్న దృశ్యం

యాంటీబయాటిక్ మందులు వేయొద్దు

గార్లదిన్నె: ఆర్ఎంపీలు యాంటీబయాటిక్ మందులు వాడరాదని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు గౌతమి, యర్రగుంట్ల పీహెచ్‌సీ వైద్యుడు దిలీప్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆర్ఎంపీల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్ఎంపీలు బోర్డుల మీద ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అని రాసుకోవాలన్నారు. ప్రథమ చికిత్స కేంద్రం కొనసాగిస్తూ గాయాలకు కట్లు కట్టడం,ఆరోగ్య సూచనలు ఇవ్వడం , చికిత్సకు వెళ్లాల్సిన ప్రభుత్వ ఆస్పత్రుల వివరాలు తెలియ జేయాలన్నారు. వైద్యులు అని పేరు పెట్టుకోరాదన్నారు.అలాగే ప్రథమ చికిత్స కేంద్రానికి వచ్చే వారికి ఎలాంటి ద్రావణాలు, సూది మందులు ఎక్కించరాదన్నారు. యాంటీ బయాటిక్స్, ఐవీ ఫ్లూయిడ్స్,ఇంజక్షన్లు,స్టీరియడ్స్, మైనర్ సర్జరీస్,అబార్షన్స్ చేయరాదన్నారు. ఎటు వంటి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయకూడదన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల ఆర్ఎంపీలు పాల్గొన్నారు.



ఏంటబ్బా ఇది.. నీళ్లలాగా ఉందే..



తాగి చూస్తే పోలా.. బాగుందే



గ్లాస్ తీసుకు పోదాం..

తీగుంది..! టీ తాగిన వానరం

గుంతకల్లు: సాయంత్రం వేళ.. చిరుజల్లులు కురవడంతో వాతావరణం చల్లబడింది. దీంతో వానరానికి టీ తాగాలనిపించిదేమో.. ఓ భక్తురాలు నుంచి గ్లాస్ లాక్కొని టీ తాగేసింది. ఈ ఘటన ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు..అనంతపురంకు చెందిన అమర్, శిరీష దంపతులు శ్రావణమాసం సందర్భంగా మురడి, నేమకల్లు, కసాపురం పుణ్యక్షేత్రలకు పర్యటనలో భాగంగా మంగళవారం కసాపురానికి వచ్చారు. కసాపురం రాజగోపురం ఎదుట సేద తీరుతూ వారు తెచ్చుకున్న ప్లాస్క్‌లో టీ తాగుతున్న సమయంలో ఓ వానరం వారి దగ్గరకు వచ్చింది. ఆమె చేతిలోని టీ కప్పును లాక్కొని దర్జాగా టీ మొత్తం తాగేసింది. అంతటితో అగకుండా టీ కప్పును కూడా తీసుకెళ్లింది. అదే సమయంలో 'సాక్షి' ఈ ఫొటోలను క్లిక్ మనిపించింది.

పింఛన్లు సక్రమంగా పంపిణీ చేయండి

గుంతకల్లు రూరల్/గుత్తిరూరల్/పుట్లూరు: పింఛన్ల పంపిణీ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి సిబ్బందికి సూచించారు. మంగళవారం గుంతకల్లులోని ఎంపీడీవో కార్యాలయంలో ఆయన పింఛన్ల పంపిణీ సిబ్బందితో సమావేశమయ్యారు. అలాగే గుత్తిలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండలంలోని కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఎంపీడీఓ శివాజీరెడ్డి సమావేశం నిర్వహించారు. అదేవిధంగా పుట్లూరు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ యోగానందరెడ్డి, ఈఓఆర్డీ ఆనంద్ పాల్గొన్నారు.

రిమాండ్‌కు టీడీపీ నాయకులు

యాడికి: మండలంలోని బోయరెడ్డిపల్లిలో ఈ నెల 15న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి చేసిన ఘటనకు సంబంధించి తొమ్మిది టీడీపీ నాయకులను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు తెలిపారు. దాడికి సంబంధించి 12 మంది టీడీపీ నాయకులపై కేసు నమోదు కాగా, మంగళవారం కుక్కల నాగేశ్వర, కుక్కల శ్రీనివాసులు, కుక్కల వెంకటరమణ, కుక్కల నాగేంద్రప్రసాద్, పడమల శివగంగరాజు, పడమల వేణుగోపాల్, పడమల లక్ష్మీనారాయణ, పడమల గంగరాజు, చింతకాయల లోకేశ్వరను అరెస్ట్ చేశారు. నిందితులను జడ్జి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ఈ- పంట నమోదు చేసుకోవాలి

గుంతకల్లు రూరల్: రైతులు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ రమాదేవి, ఏఓ స్వాతి సూచించారు. మంగళవారం మండలంలోని తిమ్మాపురంలో వారు పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పంట నష్ట పరిహారం, ఈ-పంట నమోదుతోనే ముడిపడి ఉన్నందున రైతులు తప్పనిసరిగా ఈ-క్రాఫ్ నమోదు చేయించుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో అందజేస్తున్న ప్రత్యామ్నాయ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పి.కొట్టాలపల్లిలో జాతీయ నేత్రదాన పక్షోత్సవం

పెద్దపప్పూరు: మండలంలోని పి.కొట్టాలపల్లిలో మంగళవారం జీపీఎంఓ మధుసూదనరాజు ఆధ్వర్యంలో జాతీయ నేత్రదాన పక్షోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కంటి జబ్బులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి సమస్యతో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించి మందులను పంపిణీ చేశారు.

కుక్క దాడిలో బాలుడికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని బసినేపల్లి తండా గ్రామంలో వేదాంతనాయక్ అనే బాలుడిపై మంగళవారం వీధి కుక్క దాడి చేసింది. గ్రామానికి చెందిన శ్రీనివాస్‌నాయక్ కుమారుడు వేదాంత నాయక్ ఇంటి బయట ఆడుకుంటుండగా కుక్క దాడి చేసి కరిచింది. గాయపడిన బాలుడిని వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలించారు.

సంక్షిప్త వార్తలు

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

గుత్తి: అంగన్‌వాడీ కార్యకర్తలు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సీడీపీఓ ఢిల్లీశ్వరి హెచ్చరించారు. స్థానిక సీడీపీఓ కార్యాలయంలో మంగళవారం గుత్తి, పామిడి, గుంతకల్లు సెక్టార్ల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్లు , అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

17వ సోషల్ ఆడిట్

తాడిపత్రి రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం 17వ సోషల్ ఆడిట్ నిర్వహించారు. 2023-24 సంవత్సరానికి గానూ 1,487 పనులకు రూ.7.48 కోట్లను ఖర్చు చేశారు. ఇందులో రూ,89.906లను రికవరీకి ఆడిట్ సిబ్బంది ఆదేశించారు. ఇందులో బోడాయిపల్లిలో రూ.2 లక్షలు, గంగాదేవిపల్లిలో రూ.9 లక్షలపై విచారణ జరపాలని ఏపీడీకి అధికారులు సూచించారు.

మహిళ అదృశ్యం

గార్లదిన్నె: మండలంలోని ఇల్లూరుకు చెందిన ఓ మహిళ అదృశ్యమైనట్లు ఎస్ఐ గౌస్ మహ మ్మద్ బాషా తెలిపారు. మంగళవారం ఎస్ఐ మాట్లాడుతూ గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ ఇటీవల మృతిచెందాడు. అతడి రెండో భార్య అలివేలు పద్మావతి మతిస్థిమితం సరిగా లేక ఈ నెల 8న ఇంటి నుంచి బయటకు వెళ్లింది. పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆమె కుటుంబీకులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్ బోల్తా.. ఇద్దరికి గాయాలు

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద సోమవారం రాత్రి ఆవును తప్పించబోయి బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. వివరాలు.. ఆర్ఎస్‌కు చెందిన యువకులు తరుణ్, దర్గా బైక్‌లో గుత్తికి వస్తుండగా ఆవు అడ్డం వచ్చింది. ఆవును తప్పించబోయి బైక్ బోల్తా పడింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన యువకులను గుత్తి ఆస్పత్రికి తరలించారు. అనంతరం అనంతపురానికి రెఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మధ్యాహ్న భోజన పథకం పునరుద్ధరించాలి

గుంతకల్లు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్నాహ్న భోజన పథకాన్ని పునర్దురించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కళాశాలలో సమావేశం ఏర్పాటు చేశారు. నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు వినోద్, వెంకట్‌నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు.అనంతరం కళాశాల నూతన కమిటీని ఎన్నుకున్నారు. నాయకులు అఖిల్, రోహిత్, రాజేష్, మధు, లోకేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.